
ఓం నమోభగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



సంపుటి : 7 సంచిక : 23 పుష్పం : 63-65 20-08-2002

**RAMANA BHASKARA**
**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**
PAGES : 16

VOL : 7 ISSUE : 23

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 24278

## సృష్టి మంచిదీ కాదు - చెడ్డదీ కాదు

భగవంతుడు ఒకరికి శాంతిని, మరొకరికి శోకాన్ని ఇచ్చేటంత పక్షపాత బుద్ధి కలవాడు కాదు. మన అశాంతికి కారణం మన మనస్సే. మనస్సే అన్నిటినీ ఊహించుకొంటుంది, ఆ ఊహకు అనుగుణంగా వ్యాఖ్యానించుకొంటుంది. సృష్టి అనగా నామ రూపములు. సృష్టి మంచిదీ కాదు, చెడ్డదీ కాదు, అది ఈశ్వరునిది. ఈశ్వరుని సృష్టిలో కొంతకాలం మనం నివశించటానికి వచ్చాం. మనకు బంగారం అంటే ఇష్టం, పాములంటే భయం, రోడ్డు మీద నున్న గడ్డి, రాళ్ళు మున్నగునవంటే నిర్లక్ష్యం, ఈరకములైన విలువలు మన మనస్సు వాటికి ఆపాదించడవే మన శోకానికి మూలకారణం. సృష్టి రావిచెట్టులాంటిది, పక్షులు దాని పళ్ళు తినడానికి లేదా గూడు కట్టుకోవడానికి దానివద్దకు వస్తాయి, మనుష్యులు నీడకై దానివద్దకు వెడతారు, ఇంకొకరు ఆ చెట్టుకే ఉరి వేసుకుంటారు, కాని చెట్టు తనను ఎవరు ఎలా ఉపయోగించుకున్నా పట్టించుకోకుండా, తన మానాన తాను బ్రతుకుతుంది. సృష్టిలో విషయాలను మనం ఏ కోణంలోంచి చూస్తున్నాము అన్నదే ప్రశ్న. ఆత్మబుద్ధితోనా?, దేహబుద్ధితోనా? అన్ని రకాల సమస్యలను సృష్టించుకొనేది మనస్సే. 'దేహమేనేను' అనే తప్పడు అభిప్రాయం తొలగినప్పడు ఉన్నదే ఆనందం అంటారు శ్రీ గురు రమణులు.

**చావలి సూర్యనారాయణమూర్తి**
టీచర్, అమలాపురం

**ఈ సంచికలో......** **సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**

19-01-2002 మురమళ్ళ ........ 2
07-04-2002 నాగపూర్ ........ 9
24-07-2002 జిన్నూరు ........ 12

Visit us @ www.srinannagaru.com





### (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-01-2002, మురమళ్ళ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

అన్నిమతాల యొక్క సారం ఒక్కటే. అన్నిమతాలలో ప్రతిపాదించిన విషయం ఏమిటి అంటే మోక్షాన్ని పొందమని, నిర్వాణస్థితిని పొందమని, ఏ సుఖాన్ని పొందిన తరువాత దానికి మించిన సుఖం లేదు అని తెలుస్తుందో అటువంటి సుఖాన్ని పొందమని ప్రతీమతం చెపుతుంది. మోక్షాన్ని పొందటానికి తగిన సామాగ్రి హిందూమతంలో ఉంది. అందువలన మతాలు మార్చుకోమని ఎవరైనా ప్రలోభపెడితే, మీ మతంలో ఏమీలేదు మా మతంలో ఔన్నత్యం ఉందని ఎవరైనా చెపితే అటువంటి మాటలు నమ్మి మతాలు మార్చుకోవద్దు. మన సభ్యత, సాంప్రదాయం, సంస్కృతి విడిచిపెట్టవద్దు. మతం మార్చుకొన్నంత మాత్రంచేత మోక్షంరాదు. గృహస్థాశ్రమం నుండి సన్యాసాశ్రమంలోకి మారితే బట్టలు మారతాయి, కొన్ని ప్రతిబంధకాలు తగ్గుతాయికాని అంతమాత్రంచేత మోక్షంరాదు. అలాగే మతం మార్చుకొన్నంత మాత్రంచేత మోక్షంరాదు, మోక్షం వస్తుంది అనుకొని మీరు వివేకాన్ని, విచక్షణను కోల్పోయి మతాలు మార్చుకోవటం మంచిదికాదు. హిందూమతం చాలా ప్రాచీనమైన మతం, సనాతనమతం, ఇది ఏదో వ్యక్తిచేత స్థాపించబడినదికాదు, పంచభూతాలు ఎప్పటినుండి ఉన్నాయో అప్పటినుండి ఈ మతం ఉంది. మనం ఏరకంగా జీవిస్తే, ఏరకంగా ప్రవర్తిస్తే మనకు మోక్షానుభవం కలుగుతుందో వివరంగా హిందూమతంలో చెప్పారు. అన్నిమతాలలో చెప్పిన విషయాలు కూడా మన ప్రాచీన గ్రంథాలయిన ఉపనిషత్‌లలో, భగవద్గీతలో ఉన్నాయి. మన హృదయంలో ఒక సత్యంఉంది, దానిని ఎలా అనుభవంలోనికి తెచ్చుకోవాలి అని చెప్పటానికే మతాలు వచ్చాయి. మనకు భగవద్గీత ప్రమాణగ్రంథం. మీరు ఏదేవతాపురుషుడిని ఆరాధించినా నన్నే చేరుకొంటారు అంటే చైతన్యంలో ఐక్యమవుతారు అని గీతలో భగవంతుడు చెప్పాడు. ప్రతీ గ్రామానికి బడి ఎంతముఖ్యమో, గుడికూడా అంతేముఖ్యం. బడి మనకు లౌకిక విద్యలను నేర్పుతుంది, గుడి మనకు మోక్షవిద్యను నేర్పుతుంది. గుడికి వెళ్ళి దైవదర్శనం చేయటం వలన మనస్సు చల్లబడుతుంది, మనస్సుకు లోచూపు కలుగుతుంది.

రూపానికి, నామానికి సంబంధించిన తలంపులే మనలను బంధిస్తున్నాయి. ఈశ్వరుని యొక్క అవతారములలో ఏదో ఒక రూపాన్ని, నామాన్ని స్మరించటం వలన మన

నామరూపములకు దూరమై ఆ నామరూపములలో ఐక్యమవుతాము. మీరు ఏ కులస్థులయినప్పటికి, ఏ మతస్థులయినప్పటికి లోపల కపటం ఉండకూడదు, కల్మషం ఉండకూడదు. లోపల కపటం పెట్టుకొని, కల్మషం పెట్టుకొని ఏదేవుడిని ఆరాధించినా ప్రయోజనం లేదు. ముందు కపటంలోనుండి, కల్మషంలోనుండి విడుదలపొందాలి. మనం ఏదో మార్గాన్ని అవలంభించి లేక అన్ని మార్గాలను సమన్వయం చేసుకొని ఈ భూమిమీద తిరుగుతుండగానే కపటంలోనుండి, కల్మషంలోనుండి, వ్యక్తిభావనలోనుండి, ఆడంబర జీవితంలోనుండి విడుదలపొందటానికి ప్రయత్నం చేయాలి. ఆధ్యాత్మిక అనుభవం కావాలంటే ఈశ్వరానుగ్రహం ఉండాలి. మనం ఒకమాట మాట్లాడితే, చేతితో ఒక పనిచేస్తే, మనకు ఒక తలంపువస్తే అవి ఈశ్వరానుగ్రహానికి పాత్రులవ్వటానికి మనకు సహకరించాలి. మనిషి అహంభావన కోసమే జీవిస్తున్నాడు. అహంభావన ఒక పిశాచం వంటిది. అహంభావనను తొలగించుకోవటమే మన జీవితలక్ష్యం, దానికే సాధన. నిన్ను ఎవరైనా అవమానపరిచారు అనుకో దానిని నీవు భరించగలిగితే అదికూడా సాధనలో ఒక భాగమే. ఎవరైనా అవమానిస్తే కృంగిపోయేది, ఎవరైనా సన్మానం చేస్తే పొంగిపోయేది లోపలఉన్న ఆత్మకాదు, ఇది అంతా మనస్సే, అహంకారమే. ప్రతిబంధకాలు అన్ని కల్పించేది అహంకారమే. దానిని తీసి ఒక ప్రక్కన పెట్టు. అదే సాధన. నీకు వందకోట్లు డబ్బు ఉంది, అంతర్జాతీయంగా కీర్తి ఉంది, 10 డాక్టరేట్‌లు ఉన్నాయి అనుకో అయినా నీకు దుఃఖం వస్తోంది అనుకో వాటివలన ప్రయోజనం ఏమిటి? అటువంటి ఆకర్షణలకు గురి అవ్వవద్దు. ఇలా ఆకర్షణలకు గురి అయితే మనస్సు లోపలకు వెళ్లదు, బాహ్యముఖానికి వచ్చేస్తుంది. మనం ఎవరిమో మనకు తెలియటంలేదు కాబట్టి మనం కానిదంతా మనకు నిజంవలె అనిపిస్తోంది. మీకు దుఃఖం వచ్చింది అనుకోండి. ఆ దుఃఖం మీరు అవునా? ఆ దుఃఖం మీరు కాదు కాబట్టి దానినితీసి ఒక ప్రక్కన పెట్టు. పరిస్థితులు అనుకూలంగా ఉంటే మీకు గర్వం వస్తుంది. ఆ పరిస్థితులతో తాదాత్మ్యం పొందేనేను మీరు అవునా? ఆ నేను మీరుకాదు అందువలన దానిని తీసి ఒక ప్రక్కనపెట్టండి. మీరు ఏదైతే కాదో దానినితీసి ఒక ప్రక్కనపెడితే మీరు ఏదైతే అవునో అది మీకు అనుభవంలోనికి వస్తుంది. రాగద్వేషాలు భక్తి అనుకోవద్దు. అవి అన్నీ ఉద్రేకాలు. ఉద్రేకాలు వచ్చినప్పుడు మన స్వరూపానికి మనం దూరమవుతాము. ఏ కారణాలవలన మన స్వరూపానికి దూరమవుతున్నామో అర్థంచేసుకొని ఆకారణాలను బయటకులాగి, కాల్చి బూడిద చేయటమే



1A

తపస్సు, అదే యోగము. అహం అంటే నేను ఉన్నాను, అది ఎప్పుడూ ఉంటుంది. కారం అలాకాదు వస్తూ ఉంటుంది, పోతూ ఉంటుంది. తమోగుణం, రజోగుణం ఈ గుణాలు వచ్చినప్పుడు హెచ్చుతగ్గులు ఉంటాయి, ఇదే కారం, ఈ కారాన్ని తీసి ఒక ప్రక్కన పెడితే మనం ఎవరిమో మనకు తెలుస్తుంది, భగవంతుడే మనకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. నాకు మోక్షం ఎప్పుడు వస్తుంది అని ఒకరు భగవాన్‌ను అడిగారు. నువ్వు అసలు పుట్టలేదన్న సంగతి నీకు అర్థమయితే ఈ జన్మలోనే నీకు మోక్షం వస్తుంది అని చెప్పారు. అహంకారానికి దేవతలు కావాలి, ధర్మం కావాలి, అధర్మం కావాలి, అన్నీ కావాలి. ధర్మం, అధర్మం ఇవి అన్నీ నీ మనస్సు యొక్క సృష్టి. మనస్సు అనే గడప దాటితే ధర్మానికి అధర్మానికి, చావు పుట్టుకలకు అతీతమైన స్థితికి వెడతావు. మనకు ఉండవలసినంత వైరాగ్యంలేదు, అభ్యాసంలేదు. మనం ఈ రెండూ వదిలేసాము, రాగద్వేషములను పట్టుకొన్నాము. ఉన్నది బ్రహ్మం ఒక్కటే. అదే నీకు లోకంగా కనిపిస్తోంది. అక్కడ నుండి రాగద్వేషములు, చావు పుట్టుకలు అన్నీ వస్తున్నాయి. దేహమునేను అనే తలంపునుండే అన్ని వికారములు పుడతాయి. దుఃఖానికి కారణం బయటలేదు, నీలోపలే ఉంది. అందుచేత లోపల వెదికి, దుఃఖకారణాన్ని బయటకు లాగి దానిని తగులబెట్టాలి. దేహమునేను అనే తలంపే నీ దుఃఖానికి కారణం. దేహంతో తాదాత్మ్యం పొందే మొదటితలంపును విడిచిపెట్టావు అనుకో నీకు మిగిలింది ఏమీలేదు, అన్నీ విడిచి పెట్టినట్లే అన్నారు భగవాన్. నీ ఆడంబరాలు, ఆస్తులు, పదవులు, గౌరవాలు అన్నీ వదిలివేసావు అనుకో కాని దేహమునేను అనే తలంపును ఉంచుకొన్నావు అనుకో, నువ్వు ఏదీ విడిచిపెట్టని వాడితో సమానము. ఆ మొదటితలంపును త్యాగం చెయ్యి. మీ ఆశీస్సులు కావాలి అని ఒకరు భగవాన్‌ను అడిగారు. భగవాన్ ఏమి చెప్పారు అంటే అక్కడ అడిగేది ఎవరు? ఇక్కడ ఇచ్చేది ఎవరు? అక్కడ అడిగేది మనస్సు, ఇక్కడ ఇచ్చేది మనస్సు. అసలు ఉన్నది ఒకటే వస్తువు, అదే బ్రహ్మం. ద్వేషము, భయం, కోరిక అన్ని వికారములు ద్వైతంలో నుండి వస్తాయి, నీకు దేహబుద్ధి ఉన్నంతకాలం ద్వైతంలోనుండి బయటకురాలేవు.

అహంకారాన్ని విడిచిపెట్టటం అన్నింటికంటే కష్టసాధ్యము. దానికి గురువు అనుగ్రహం ఉండాలి, మనస్సు పల్చబడాలి, మీకు వివేకం ఉండాలి, సత్వగుణం పెంచుకోవాలి, ఈశ్వరానుగ్రహం ఉండాలి. ఈ ఎక్విప్‌మెంట్ అంతాకూడా అహంకారం అనే జైలునుండి బయటకు రావటానికే, భగవంతుడు నీ హృదయంలో ఉన్నాడు అని శాస్త్రం చెపుతోంది.

శాస్త్రం చదవటం వలన పాండిత్యం వస్తుంది. ఎక్కడైతే ఈశ్వరుడు ఉన్నాడో అక్కడ అన్వేషణ చేస్తే ఆయన తెలియబడతాడు. పాండిత్యం ముఖ్యంకాదు, భగవదనుభవం ముఖ్యం. ఎవరో ఏదో ఇస్తాము అంటే మతం మార్చుకొంటే ఇంక మీకు జ్ఞానం ఏమిటి? అటువంటి స్వల్ప విషయాలకు, ఆకర్షణలకు లోనయితే మీరు ఏమతంలో ఉన్నా మీకు మోక్షానుభవం కలుగదు. కొంతమంది చాలా స్వీట్‌గా మాట్లాడుతారు, మన క్షేమంకోరి చెపుతారు, ఆ మాటలలో ఉద్రేకం ఉండదు, వారు అనుభవించి ఆ అనుభవంలోనుండి తీసి మనకు చెపుతారు, ఆ మాటలు మోక్షానుభవం పొందటానికి మనకు సహకరిస్తాయి. మీరు మాట్లాడే మాట మీకు ఉపయోగపడాలి, ఇతరులకు ఉపయోగపడాలి. మీ చైతన్యస్థాయి పెరగటానికి ఆ మాట మీకు సహకరించాలి. ఆధ్యాత్మికంగా, భౌతికంగా ఉన్నతస్థితికలగటానికి ఇతరులకు ఆ మాట సహకరించాలి. ఋషులపట్ల, యోగులపట్ల, మన పూర్వీకులపట్ల మనం గౌరవభావంతో ఉండాలి. ఏ మనిషినైనా గౌరవించటంవలన మనం లాభం పొందుతాముగాని అగౌరవ పరచటం వలన లాభం పొందము. ఇతరులు మనపట్ల ఎలా ఉంటున్నారు అనేది ముఖ్యంకాదు, మనం అందరిపట్ల సమభావం కలిగిఉండాలి. మీరు మీరుగా ఉండాలి. మీరు ఎవరిగా ఉన్నారో అందులోనుండి మీరు జారకూడదు. లోకంలో ఉన్న విషయాలను కళ్ళతోచూసినా, చెవులతోవిన్నా, మీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా ప్రతికూలంగా ఉన్నా మిమ్మల్ని ఎవరైనా పొగిడినా విమర్శించినా కూడా మనం ఎలాగ ఉన్నామో అలాగ ఉండగలిగితే అంటే మీరు మీరుగా ఉండగలిగితే అది సహజసమాధి. కృష్ణుడిది సహజసమాధి. ఆయన ఇంటిదగ్గర ఎలాగ ఉండేవాడో యుద్ధభూమిలో కూడా అలాగే ఉండేవాడు.

మన జీవితం నార్మల్‌గా, నేచురల్‌గా ఉండాలి. మనం కృత్రిమంగా ఉంటే ఈశ్వరానుగ్రహానికి దూరమవుతాము. మనకు అర్హత, యోగ్యతవస్తే ఆత్మజ్ఞానం ఇమ్మని మనం భగవంతుడిని అడగనక్కరలేదు, ఆయనే మనకు వ్యక్తం అవుతాడు. నీ జీవితగమ్యం ఏమిటి అంటే బ్రహ్మానుభవం పొందాలి. ఆ స్థితిని పొందేవరకు నిన్ను జననమరణాలు వెంటాడతాయి, ఆస్థితిని పొందేవరకు నీవు మధ్యలో ఎవరితోనైనా మాట్లాడవచ్చు, ఎవరికైనా సహాయసహకారములు అందించవచ్చు కాని అది గమ్యంకాదు. అక్కడ నీ టైమును, నీ శక్తిని వృధా చేసుకోవద్దు. మనం ఒకేచోట పడిఉంటే ఇంక గమ్యస్థానానికి చేరలేము. మనకు లోపల సరియైన అవగాహన లేకపోతే గోల్‌మిస్ అయిపోతాము. అందువలన కరెక్టు





అండర్‌స్టాడింగ్ ఉండాలి. మనందరికి ఉండాలని ఉంది, ఎవరికీ చనిపోవాలని లేదు, ఆ ఉండటమే దేవుడు. నీ మనస్సు దాని మూలంలో లయమయ్యేవరకు నీ ప్రయాణం పూర్తికాదు. అందువలన నీ మనస్సు దాని మూలంలో లయమయ్యేవరకు నీవు ఏదోమార్గంలో ప్రయాణం చెయ్యి. నీ మనస్సు నిశ్శేషంగా నశిస్తే నీకు బ్రహ్మానుభవం కలుగుతుంది. అంతేగాని అది 1% మిగిలిఉన్నా నీకు పునర్జన్మను తీసుకొని వస్తుంది, మరల బంధంలో పడిపోతావు. మనస్సు పూర్తిగా నశించేవరకూ దానిని నమ్మటానికి వీలులేదు. ట్రైనింగ్ పొందటానికి మనం ఈ లోకంలోనికి వచ్చాము. లాభం, నష్టం, గౌరవం, అగౌరవం ఇవి అన్నీ వస్తాయి, వాటిని నీవు భరించాలి. వాటినే భరించలేకపోతే ఇంక నీకు ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది. మనస్సు ఎంత వరకు వ్యక్తమవుతోందో అంతవరకు నీవు ఉపాసన విడిచిపెట్టకూడదు. మనస్సు నీకు వ్యక్తం కావటం లేదు అనుకో నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. దేహాన్ని, మనస్సును ఆరోగ్యంగా ఉంచుకోండి, సత్పురుషుల సహవాసం చెయ్యండి. భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములను జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. దేహాభిమానం ఉన్నవాడికి రాక, పోక ఉంటుంది. నేను పుట్టాను అని ఎంతకాలం అయితే అనుకొంటున్నావో అంతకాలం నీకు మోక్షం కలుగదు. దేహం చనిపోయిన నేను ఉంటాను, లోకం కనిపించకపోయిన నేను ఉంటాను అనే అనుభవం నీకు రావాలి. అది ఈశ్వరానుగ్రహం వలన నీకు కలుగుతుంది గాని పాండిత్యంవలన, యశస్సువలన, ధనం వలన వచ్చేదికాదు. మీకు గౌరవం ఉంటే మీ శరీరం స్మశానానికి వెళ్ళేటప్పుడు ఇంకా పదిమంది ఎక్కువ వస్తారు. అంతకంటే ఏమీలేదు. నీకు సాధన లేకపోతే మరణానంతర జీవితం సున్నా, మీరు ఇతరులను అశాంతికి గురిచేయవద్దు. ఇతరులు మిమ్మల్ని అశాంతికి గురిచేయటానికి ప్రయత్నంచేస్తే మీ శాంతిని మీరు పాడుచేసుకోవద్దు. సముద్రంలో కెరటం ఉంది. ఆ కెరటంరూపం ధరించింది నీరే. అలాగే ఈ సృష్టి అంతాకూడా నామరూపాత్మకమైనటువంటి చైతన్యమే. నీవు కెరటాన్ని కెరటం లాగచూడకు, నీరులాగ చూడు. అలాగే నీవు నామరూపాలను చూడవద్దు, వాటికి ఆధారంగా ఉన్న చైతన్యమునే చూడు. అప్పుడు నీకు వికారం కలుగదు, మాయలో పడవు. మనిషిని బంధించేది రూపబుద్ధి, నామబుద్ధి. మీకు రూపంతోటి, నామంతోటి తాదాప్యం ఉన్నంతకాలం మీరు ఎంత తపస్సు చేసినా, ఎన్ని యోగాభ్యాసాలు చేసినా మీకు మోక్షం కలుగదు.

ఇతరులకంటే నేను ఎక్కువ మనస్సును ఉపయోగించవలసి వస్తోంది, అందువలన

ఉద్యోగానికి రాజీనామాచేసి ఎక్కడికైనా వెళ్ళి సాధన చేసుకోవాలని ఉంది అని ఒక హెడ్‌మాష్టారు భగవాన్‌ను అడుగుతున్నారు. నువ్వు ఇంటి దగ్గరే ఉండు. చేస్తున్న పనినే చేస్తూఉండు. బాధ్యతలు విడిచిపెట్టి వెళ్ళిపోతే సోమరితనం వస్తుందిగాని జ్ఞానం రాదు. నువ్వు ఏదో ఉద్యోగం చేస్తున్నావు కదా. నువ్వు చేసే పని ప్రేమగా, ఇష్టంగా, శ్రద్ధగా చేస్తే ఆ పనే నిన్ను విడిచిపెట్టేస్తుంది. ప్రారబ్ధాన్ని ఇష్టంగా అనుభవిస్తే అదిపోతుంది, అలాకాకుండా దానిని అయిష్టంగా అనుభవిస్తే రాబోయేజన్మలో మరల అదే మనకు ఎదురవుతుంది. నీ పూర్వజన్మ సంస్కారమును బట్టి నీవు టీచర్ అయ్యావు, ఆపనికి నీవు న్యాయం చెయ్యి. నీవు చేసే పని హృదయపూర్వకంగా చెయ్యి, అర్పణభావంతో చెయ్యి, భక్తిభావంతో చెయ్యి, ప్రేమగా చెయ్యి, హితవుగా చెయ్యి. విసుగుదల పనికిరాదు. అలా పనిచేస్తూ ఉంటే త్యాగరాజు పాటలు పాడిఎలా తరించాడో అలాగ నీవు పనిద్వారా తరిస్తావు. మనస్సు అణిగింది అనుకో, నీవు ఎంతమంది మధ్యలో ఉన్నా ఏకాంతంగానే ఉంటావు. మనస్సు అణగనప్పుడు నీవు ఇంట్లో ఒంటరిగా తలుపులు వేసుకొని కూర్చున్నా అనేకమంది మధ్యలో ఉన్నట్లే. మనం పనిచేయాలి, పనిలోనుండే సంపద వస్తుంది, నీవు అహంకారంలో ఉండి పనిచేయకు. నీవు ఎవడిగా ఉన్నవో వాడిగా ఉండి పనిచెయ్యి. సమానబుద్ధిలో ఉండి చెయ్యి. నీ చేతులు పనిచేస్తున్నప్పటికీ మనస్సును ఆత్మపై పెట్టి, దైవభావనతో పనిచేస్తే ఆ పని యోగంతో సమానము. యోగం మనస్సును చంపేస్తుంది. మనం ఏదైనా కోరిక కోరిన దాని తాలుక వస్తువు ప్రకృతిలోనే ఉంది. అది నిజంకాదు. అక్కడకు వెళ్ళేబదులు లోపలకు వెళ్ళు సరిపోతుంది. కోరిక ఉంటేనే మనస్సు బాహ్యముఖానికి వస్తుంది, కోరిక లేకపోతే బాహ్యముఖానికి రాదు. కోరిక లేకపోతే పని అవ్వదు అని మనం అనుకొంటాము. మన దేహప్రారబ్ధములో ఉన్నది మన కోరికతో సంబంధం లేకుండా జరిగిపోతుంది. మన కోరికకు శక్తిలేదు, శక్తి ఈశ్వరుడిది.

ఇంద్రియాలకు సంబంధించిన జ్ఞానం అంతా పరోక్ష జ్ఞానమే. నువ్వు ఏదిగా ఉన్నావో అదిగా ఉండటం ప్రత్యక్ష జ్ఞానం. నువ్వు తొందరపడవద్దు. నెమ్మదిగా, స్థిరంగా పనిచేసుకొంటూ వెళ్ళు కాని నీవు వెళ్ళేది రైట్ డైరెక్షన్‌లో వెళ్ళు. ఈశ్వరుడితో అనుబంధం పెట్టుకొని ఉంటే ఇంక అసలు అహంకారం వ్యక్తం కాదు, అది వ్యక్తమవ్వటం తగ్గేకొలది దాని నాశనం ప్రారంభం అవుతుంది. భగవాన్‌ను శరీరంగా చూడవద్దు. శరీరంగా చూస్తే ఆయనను అవమానించినట్లే. నీ లోపల చైతన్యప్రవాహం ఉంది. దేహమునేను అనే భావనను వదిలిపెట్టి, ఆ ప్రవాహంలో



2A

కలిసిపో. లోపలఉన్న చైతన్యప్రవాహంలో కలిసిపోతే నీకు ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా శాంతే, ఎటుచూసినా సుఖమే. అది స్వతంత్రమైనది. నీ కర్తృత్వమే నీకు భేదబుద్ధిని కల్పిస్తోంది. కర్తృత్వాన్ని విడిచిపెడితే భేదబుద్ధి నశిస్తుంది, ఆ మరుక్షణంలో దుఃఖం కూడా నశిస్తుంది. అప్పడు ఆనందసాగరంలో ఊగిసలాడతావు, అప్పడు నీవు చేస్తున్నపని నీకు కష్టం అనిపించదు. హెడ్‌మాష్టారుతో భగవాన్ ఏమి చెప్పారు అంటే పని విడిచిపెట్టి మీరు ఎక్కడికి పారిపోవద్దు. సన్యాసం అనేది బట్టలకు, శరీరానికి సంబంధించినది కాదు, మనస్సుకు సంబంధించినది. మీకు అంతగా సన్యాసం కావాలంటే మనస్సులో పుచ్చుకోండి అన్నారు భగవాన్. మీరు పనిని విడిచిపెట్టి ఎక్కడికో వెళ్ళిపోతే అక్కడ మనస్సు అణుగుతుంది అని ఎలా చెప్పగలము. మనస్సు అణగటం ముఖ్యం, ముందు అది చూసుకోండి. మీ శరీరం మరణించిన తరువాత మీ మనస్సు మీకూడా వచ్చేస్తుంది. మరణానంతరం మీకూడా వచ్చినప్పడు ఇప్పడు పని విడిచిపెట్టి ఎక్కడికో వెళ్ళిపోతే అక్కడకు రాకుండా ఎలా ఉంటుంది. మనస్సు రెండు పనులు ఒకేసారి చేయలేదు చింతిస్తే విషయాలను చింతిస్తుంది లేకపోతే ఆత్మను చింతిస్తుంది. నువ్వు ఋషికేశ్ వెళ్ళి విషయచింతన చేస్తావు అనుకో, ఇక్కడే ఇంటిదగ్గర ఉండి ఆత్మను చింతిస్తావు అనుకో అక్కడకంటే ఇక్కడే ఇంటి దగ్గరే నీవు బాగుపడతావు. నువ్వు కంగారుపడి పారిపోవద్దు. ముఖ్యంగా చేయవలసింది ఏమిటి అంటే మనిషి గృహస్థాశ్రమంలో ఉన్నా, సన్యాసాశ్రమంలో ఉన్నావాడు విషయచింతన లేకుండా ఆత్మచింతనలో ఉండాలి, అది ముఖ్యం. మనిషి గృహస్థాశ్రమంలో ఉండాలా, సన్యాసాశ్రమంలో ఉండాలా అన్నది విధి నిర్ణయిస్తుంది. భగవంతుడు నీ చేతికి ఏపని అయితే ఇచ్చాడో ఆపనిని ఇష్టంగా చెయ్యి. నీవు వర్తమానకాలాన్ని వదిలేసి గాలిలో మేడలు కడుతున్నావు. భగవంతుని చింతిస్తూ ఉంటే నీవు గృహస్థాశ్రమంలో ఉన్నా తరిస్తావు. దేహాన్ని ప్రారబ్ధానికి వదిలేసి నీ పనిఏదో నీవు చేసుకో. ఆత్మను చింతించు. నీ దేహం పుట్టినప్పడే హెడ్‌మాష్టారు పదవి నిర్ణయం అయిపోయింది. ఇప్పడు ఈ గోల ఏమిటి? నీ ప్రారబ్ధాన్ని బట్టి ఆ వృత్తి వచ్చింది కాబట్టి ఆ వృత్తికి న్యాయం చెయ్యి. దానినుండి పారిపోవటం వలన వాతావరణం మారుతుందిగాని నీకు మోక్షంరాదు. నీకు ఉన్న స్వేచ్ఛ ఒక్కటే ఈ దేహంతోటి, వృత్తితోటి తాదాప్యం వదిలెయ్యి. నీ పనిఏదో నీవు చేసుకో. నువ్వు ఏది అనుకొన్నా నువ్వు అనుకొనేది ఏదీ నీవు కాదు. నీవు ఆత్మవు. అందువలన ఆత్మభావనతో ఉండు, దైవభావనతో జీవించు.

# రమణభాస్కర

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 07-04-2002, నాగపూర్)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

పనికి జ్ఞానానికి ఏమీ విరోధంలేదు. భక్తిపేరు మీద పని విడిచిపెట్టవలసిన అవసరంలేదు. మన భారతదేశంలో పనికి ఇవ్వవలసిన గౌరవం ఇవ్వటంలేదు. పనిద్వారా మనం నేర్చుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి. అలా అని పనే సర్వస్వంకాదు. మనం ఇతరులమీద ఆధారపడకుండా మనపని మనం చేసుకోవాలి. ఇతరులపట్ల దయకలిగి ఉండాలి. మనపనిమనం చేసుకొంటూ ఇతరులకు సహాయసహకారములు అందించాలి. మన హృదయంలో భగవంతుడు ఉన్నాడు. భగవంతుని పాదాల దగ్గరకు చేరటానికి మనకు అనేక యోగాలు ప్రతిపాదించారు. అందులో కర్మయోగం ఒకటి. మనంపనిచేస్తూ ఆపని ద్వారా భగవంతుడిలో ఐక్యమవ్వాలి. మనం ఏదైనా పనిచేస్తే అందులో భక్తి ఉండాలి. భగవంతుడిపట్ల మనకు ఉన్న ప్రేమనే భక్తి అంటారు. మన హృదయంలో సుఖం, శాంతి ఉంది. అందువలన మనం సుఖాన్ని, శాంతిని కోరుకొంటున్నాము. మన హృదయంలో ఏదైతే సహజంగా ఉందో అదే మనం కోరుకొంటున్నాము. మనకు ఎవరికి చనిపోవాలని ఉండదు ఎందుచేతనంటే ఈ శరీరం చనిపోయిన, చావులేనివస్తువు ఒకటి మన హృదయంలో ఉంది, అది మనమై ఉన్నాము. అందుచేత మనకు చావు అంటే ఇష్టం ఉండదు. ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మనం తక్కువ మాట్లాడాలి, ఎక్కువ పనిచేయాలి, ఎక్కువ ఆలోచించాలి. మన జీవితం సమగ్రంగా ఉండాలి, ధర్మయుక్తంగా ఉండాలి. మనం ఏదైనా మాట్లాడినా, ఏదైనా పనిచేసినా మంచి సంకల్పంతో చేయాలి. అలా మంచి సంకల్పంతో చేయటంవలన మనకు సుఖం, శాంతి వస్తాయి. లోపల చెడ్డసంకల్పం పెట్టుకొని మాట్లాడటంవలన, పనిచేయటంవలన మనిషికూడా నీడవచ్చినట్లు మనకూడా దుఃఖం వస్తుంది. అందువలన సంకల్పం మంచిది అయిఉండాలి. మనకు లోపల ఉండవలసినంత పవిత్రత, ఏకాగ్రత, వినయం, భక్తి ఉండాలి. అణిగిన మనస్సుకు ఆత్మజ్ఞానం కలుగుతుంది గాని విజృభిస్తున్న మనస్సుకు ఆత్మజ్ఞానం కలుగదు. సత్సంగంవలన ప్రాపంచిక విషయములతో సంబంధం తొలగుతుంది. చదివే పుస్తకాల విషయంలో, చేసే స్నేహాల విషయంలో జాగ్రత్తగా ఉండండి. మనం భక్తిమార్గం అవలంభించాలనుకొన్నప్పుడు భక్తి ఉన్నవారితో సహవాసం చెయ్యాలి, ఈశ్వరుడు ఉన్నాడు అనే సజీవమైన విశ్వాసం ఉన్నవారితో మనం సహవాసం చెయ్యాలి. పూర్వజన్మలో మనకు ఉన్న రాగద్వేషములే ఈ జన్మలో మనకు ప్రారబ్దం క్రింద





వస్తుంది. అందుచేత రాగద్వేషముల యొక్క వేగం తగ్గించుకోవాలి. ఈశరీరం శవం అవ్వకముందే ఎవడైతే రాగద్వేషముల యొక్క వేగం తగ్గించుకొన్నాడో వాడికి లోపలఉన్న సుఖం, శాంతి అందుతుంది. నీవు పనిచేసుకొంటూ నీ హృదయంలో ఉన్న మరణంలేని వస్తువును పొందటానికి కృషిచెయ్యి. కర్మ అనేది, భక్తి అనేది, ధ్యానం అనేది ఇవి మార్గములు మాత్రమే. నీవు పొందవలసినది నీ దేహానికి, మనస్సుకు, బుద్ధికి, ఈ మార్గాలకు అతీతంగా నీ హృదయంలో ఉంది. నీ హృదయంలో ఉన్న వస్తువును పొందేవరకు నీకు పునర్జన్మలు తప్పవు. పునర్జన్మ హేతువులు అన్నీ మనస్సులో ఉంటాయి. శరీరం కాలినప్పుడు మానసిక కర్మ కాలదు. మానసికకర్మ ఎంతకాలం అయితే ఉందో అంతకాలం జన్మ తరువాత జన్మ ఇలా జన్మలు వస్తూనే ఉంటాయి. నీ హృదయంలో ఉన్న భగవంతుడిని చేరుకొనేవరకు పునర్జన్మలు తప్పవు.

భగవదనుభవం పొందటానికి మనకు లోచూపు ఉండాలి, ఇన్నర్‌లైఫ్ ఉండాలి. లోచూపు ఉన్నవారికి, ఇన్నర్‌లైఫ్ ఉన్నవారికి లోపలఉన్న ఆనందం అందుతుంది. నువ్వు ఏపనిచేసినా, ఏమాట మాట్లాడినా నీలోపలఉన్న ఈశ్వరుడి యొక్క అనుగ్రహాన్ని సంపాదించటానికి చెయ్యి. ఆయన సంతోషించే పనులు మనం చేస్తూఉంటే, ఆయన సంతోషించే మాటలు మనం మాట్లాడుతూ ఉంటే, ఆయనకు సంతోషం కలిగించే తలంపులు మనకు వస్తూఉంటే ఆయన అనుగ్రహానికి మనం పాత్రులవుతాము, అప్పుడు ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు, అదే మోక్షం. ఇప్పుడు మనం ప్రపంచానికి దగ్గరగా ఉన్నాము, దేవునికి దూరంగా ఉన్నాము. నువ్వు ప్రపంచానికి దూరం అవ్వాలంటే, దేవునికి దగ్గర అవ్వాలంటే సత్పురుషుల సహవాసం వలన ఆ స్థితిని పొందగలవు. మనం అహంకారముతో ఎవరికైనా ఉపకారం చేసాము అనుకోండి మనకు పుణ్యం వస్తుందికాని జ్ఞానంరాదు. అహంకారం లేకుండా ఉపకారం చేస్తే పుణ్యం వస్తుంది, చిత్తశుద్ధి వస్తుంది, మోక్షం కలుగుతుంది. నువ్వు ఏపనిచేసినా అహంకారరహితంగా చెయ్యి. ఇతరులకు ఏదైనా చేసినా ఆ ఉపాధికూడా నాదే అనుకొని చెయ్యి. అప్పుడు నీకు బేదబుద్ధి నశిస్తుంది, శవబుద్ధి నశిస్తుంది. శవబుద్ధి నశించిన మరుక్షణంలో నీకు శివబుద్ధి కలుగుతుంది. రహస్యం అంతా మనస్సులో ఉంది. మనస్సు బయటకు వెళితే బంధం, అది లోపలకు వెళితే మోక్షం. అది ఎటువెళుతోందో చూసుకో. మనం చేసేపని నిర్మలంగా, నిశ్చలంగా, రజోగుణం లేకుండా చేయాలి. ఇతరులను చూసి భయపడకండి, మీరు ఇతరులను భయపెట్టవద్దు. ఇతరులను చూసి భయపడినా, ఇతరులను భయపెట్టినా మీకు రజోగుణం పెరుగుతుంది. ఇతరులలోని

దోషాలు చూడవద్దు, నీ బుద్ధిలో ఉన్న దోషాలు చూసుకొని, వాటిలోనుండి విడుదల పొందటానికి ప్రయత్నం చెయ్యి. మీరు పెద్ద పెద్ద సాధనలు చేయలేకపోయినా కొద్దిగా భక్తిని ఆశ్రయించి, రజోగుణం లేకుండా మీ పని మీరు చేసుకొంటూ, ఇతరులకు మాట సాయంగాని, మీరు చేయగలిగిన సహకారంకాని చేస్తూ భగవంతునిపాదాలను విడిచిపెట్టకుండా జీవించటం నేర్చుకోండి. నిరంతరం భగవంతుని జ్ఞాపకం పెట్టుకోవటంవలన మనస్సు పవిత్రమై, ఆత్మాకారం చెందుతుంది. Be good, Do good అని శివానంద చెప్పేవారు. మంచి చెయ్యగలంగాని, మంచిగా ఉండటం చాలా కష్టం అని ఒకరు శివానందతో అన్నారు. మంచిగా ఉండగలిగితే నీకులోచూపు కలుగుతుంది, లోపలఉన్న వస్తువు నీకు అందుతుంది. మంచి చెయ్యగా, చెయ్యగా నువ్వు మంచిగా ఉండగలిగే స్థితి నీకు కలుగుతుంది. మన మనస్సు ఎప్పుడూ చల్లగా ఉండాలి. ఇతరులకు చల్లదనం కలగటానికి మనం సహకరించాలి. మనం చెయ్యవలసిన పని చెయ్యాలి, ఇతరులకు సహకరించాలి. వారు బాగుపడవచ్చు, బాగుపడకపోవచ్చు, కాని చేసాననే తృప్తి నీకు ఉంటుంది, నీవు ఈశ్వరుని దయకు పాత్రుడవుతావు. పరమాత్మలో స్థిరపడిన వాడికి గౌరవం వస్తే ఏముంది, అగౌరవం వస్తే ఏముంది, చావు వస్తే ఏముంది, పుట్టుక వస్తే ఏముంది, వాడికి పరమాత్మ తప్పించి ఏమీ కనబడదు. మనం తల్లి కడుపులో ఉండగానే ప్రారబ్దం తయారయిపోతుంది. ఈ దేహం ప్రారబ్దం ప్రకారం ఎప్పడు, ఎక్కడ, ఎలా ఉండాలో అలా ఉంటుంది, ఎప్పడుపోవాలో అప్పడుపోతుంది. ప్రారబ్దం దేహానికి మాత్రమే. దేహప్రారబ్దమును బట్టి మంచి, చెడు వస్తాయి. కాని నీవు వాటితో తాదాప్యం చెందవద్దు. వాటితో తాదాప్యం చెందితే కొత్తవాసనలు వస్తాయి. ఒక వీక్ మైండ్ మీద స్ట్రాంగ్ మైండ్ పనిచేస్తుంది. మనకంటె ఎక్కువ చైతన్యస్థాయి ఉన్నవారితో సహవాసం చేయటం వలన వారి వైబ్రేషన్స్ మనమీద పనిచేస్తాయి, నీకు పవిత్రత వస్తుంది; నీకు లోచూపు కలుగుతుంది. లోపల ఉన్న వస్తువు నీకు అనుభవంలోనికి వస్తుంది. శ్రీకృష్ణచైతన్య ఏమి చెప్పారు అంటే మనకు కళ్ళు, చెవులు, కాళ్ళు, చేతులు ఉన్నాయి. భగవంతుని రూపాన్ని చూడటానికి మన కళ్ళను ఉపయోగించుకోలేదు అనుకోండి, భగవంతుడు చెప్పినమాట వినటానికి మన చెవులను ఉపయోగించు కోలేదు అనుకోండి, ఏదైనా గుడికి వెళ్ళటానికి మన కాళ్ళను ఉపయోగించు కోలేదు అనుకోండి, మంచిపని చేయటానికి మన చేతులను ఉపయోగించుకోలేదు అనుకోండి వీటి ఉపయోగం సున్న అని చెప్పారు. అందువలన నీ ఇంద్రియాలను, మనస్సును, దేహాన్ని భగవదనుభవం పొందటానికి మేగ్జిమమ్ ఉపయోగించుకో.

**20-08-2002**



3A

# రమణభాస్కర

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 24-07-2002, జిన్నూరు (గురుపూర్ణిమ))**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు వ్యాసపూర్ణిమ. వ్యాసపూర్ణిమనే గురుపూర్ణిమగా మన పెద్దలు ఏర్పాటు చేసారు. ఈరోజున ఎవరి గురువుకు వారు కృతజ్ఞత తెలియపర్చుకోవటం కోసం గురుపూర్ణిమను ఏర్పాటుచేసారు. మనకు గురువుఅనుగ్రహం చాలా అవసరం. అందరు గురువులు సమానమే. దీపావళి, సంక్రాంతి పండుగలవలె హిందూ పండుగలలో గురుపూర్ణిమ కూడా ఒక పెద్ద పండుగ. గురువుకు శిష్యుడిమీద ప్రేమ ఉండాలి. శిష్యుడికి శ్రద్ధ ఉండాలి, నేర్చుకోవాలనే తపన ఉండాలి. ఈ రెండూ అవసరమే. సూర్యుడు బయట చీకటిని పోగొడతాడు, గురువు అంటే నీలోపలఉన్న చీకటిని పోగొట్టేవాడు. అనేక జన్మలలో పుణ్యకర్మలు చేస్తే, నిష్కామకర్మచేస్తే, స్వార్థంలేకుండా సామాజిక స్పృహతో ఎంతో కొంతపనిచేస్తే, దైవార్పణంగా ఏదైనా పనిచేస్తూఉంటే, ఈశ్వరుడి పాదాలయందు భక్తి కలిగిఉంటే ఆ ఈశ్వరుడే గురు రూపంలో వస్తాడు అని భగవాన్ చెప్పారు. పూర్వపుణ్యం లేకపోతే గురువుయందు మనకు ప్రేమ, ఆప్యాయత, శ్రద్ధ, భక్తి కలుగదు. జన్మాంతర అనుబంధమును బట్టి ఒకో గురువు మీద మనకు ఆకర్షణ కలుగుతుంది. మన దేశంలో అనేకమంది సద్గురువులు ఉన్నారు. మన గురువే గొప్పవాడు మిగతా గురువులు తక్కువవారు అనుకోకూడదు. మీ లోపలఉన్న వాసనల యొక్క వేగం, తలంపుల యొక్క వేగం వలన ఒకోసారి తాత్కాలికంగా మనం గురువుకు దూరమవుతున్నట్లు అనిపిస్తుంది. మీరు గురువును విడిచిపెట్టినా, గురువు మిమ్మల్ని విడిచిపెట్టడు. గురువుతో ఉన్న అనుబంధం అటువంటిది. నిజమైన గురువు మన హృదయంలో చైతన్యంగా ఉన్నాడు. మనలను గైడ్ చేయటానికి ఆయనే బాహ్యంగా గురురూపంలో వస్తాడు. బయటగురువు నిన్ను లోపలకు నెట్టటానికి చూస్తాడు, లోపలగురువు నిన్ను లోపలకు లాక్కోవటానికి చూస్తూ ఉంటాడు. గురువుయొక్క కృపలేకుండా మనకు ఆత్మజ్ఞానం కలుగదు. ఆత్మవిద్య సముపార్జనే అన్నింటికంటే గొప్పపని, అంతకంటే గొప్పపని ఈ లోకంలో ఏమీలేదు. మనం ఎవరో మనం తెలుసుకోవటం కంటే పెద్దపని మనకు ఈ సృష్టిలో ఏమీలేదు.

మాకు బాహ్యంగా ఏమీ అక్కరలేదు అని చెప్పేవారు ఉన్నారుగాని మాకు సుఖం అక్కరలేదు, శాంతి అక్కరలేదు అని చెప్పేవారు ఏ మతంలోను లేరు, ఈ సృష్టిలో ఎవరూ లేరు. మన స్వరూపంలో ఉన్నది సుఖం, శాంతి, ఆనందం. మనం సుఖాన్ని కోరుకొంటున్నాము అంటే మనకు తెలిసినా, తెలియకపోయినా మనం ఎవరిమో మనం తెలుసుకోవటానికి

ప్రయత్నం చేస్తున్నాము అని అర్థం. ప్రతీ జీవుడు కూడా సుఖాన్ని లోకంలో వెతుకుతాడు. డబ్బు లేకపోతే డబ్బు వస్తే మనకు సుఖం వచ్చేస్తుంది, విద్యలేకపోతే విద్య వస్తే మనకు సుఖం వచ్చేస్తుంది అని మనకు అనిపిస్తుంది. ఎవరికి ఏ కొరత ఉంటే అది వచ్చేస్తే సుఖం వస్తుంది అనిపిస్తుంది. ఈ శరీరం వదిలిపెట్టి కైలాసం, వైకుంఠంవెడితే సుఖం వస్తుంది అని మనకు అనిపిస్తుంది. ఇది నిజంకాదు. సుఖం, శాంతి అనేది బయట ఎక్కడాలేదు. సుఖ సముద్రం, ఆనంద సముద్రం నీలోపలే ఉంది. జన్మజన్మలనుండి బాహ్యదృష్టికి అలవాటుపడిన నీ మనస్సుకు అంతర్‌దృష్టిని కలుగజేసి, నీకు ఆత్మానుభవం కలుగజేసేవాడే నిజమైన గురువు, అదే గురువు చేసేపని. మనకు గురువుఅనుగ్రహం ఉంటే ఏదైనా సాధ్యమే. మనకు జ్ఞానం వస్తుందా, రాదా అని అనుమానం పెట్టుకోవద్దు. మనం మంచివారము, మనం చెడ్డవారము అని ఇలా అనుకోవటం వలన చాలా ప్రమాదం ఉంది. ఇలా అనుకోవటం వలన మనకు ఆత్మజ్ఞానం కలగటంలేదు. ఈశ్వరుడిపట్ల భక్తిలేకపోతే మనకు జ్ఞానంరాదు. దేశభక్తి కూడా దైవభక్తికి దారి తీస్తుంది. మనం చేసేపని శ్రద్ధగా చేస్తే అది కూడా ధ్యానంతో సమానము. భక్తిమార్గం, కర్మమార్గం, జ్ఞానమార్గం ఇవన్నీ వేరువేరుకాదు, వీటిని సమన్వయం చేసుకొంటే మనం అభివృద్ధిలోనికి వస్తాము. ఈ మార్గాలు అన్నీ పరస్పర విరుద్దమైనవికాదు, పరస్పరం సహకరించుకొంటాయి.

బ్రహ్మానుభవం పొందటానికి ఏ విషయాలు అయితే అడ్డువస్తున్నాయో వాటిని తొలగించుకోవటానికి నీవు చేసే ప్రయత్నమే తపస్సు. నిరాడంబరంగా, నిరహంకారంగా జీవించటమే తపస్సు. నీ మాటలోగాని, తలంపులోగాని అహంభావన వ్యక్తం కాకూడదు. దేహాభిమానాన్ని సాధ్యమైనంతవరకు తగ్గించుకోవటానికి ప్రయత్నం చేయాలి. ఆధ్యాత్మిక అభివృద్ధికి గురువు అవసరమా అని భగవాన్‌ను అడిగితే అవసరమే అని చెప్పారు. శిష్యుడు ఎలా ఉండాలి అంటే ముముక్షత్వం ఉబికి, ఉబికిరావాలి. భక్తి గోరువెచ్చని నీరులాగ ఉండకూడదు. మాయలోనుండి, ప్రకృతిలోనుండి, సంసార చక్రంలోనుండి విడుదల పొందాలి అని తీవ్రమైన కాంక్ష, శిష్యుడికి లోపలనుండి రావాలి. రాగద్వేషములను తగ్గించుకోవాలి. రాగద్వేషములు తగ్గించుకోకపోతే మనకు లోచూపు కలుగదు. లోచూపు లేనివారికి లోపల ఉన్న వస్తువు ఎఱుకలోనికిరాదు. గురువుచేసే ముఖ్యమైన పని ఏమిటి అంటే మన మనస్సుకు లోచూపు నేర్పుతాడు. రాగకారణం ఉన్నా రాగం లేకుండా ఉండగలిగితే, ద్వేషకారణం ఉన్నా ద్వేషం లేకుండా ఉండగలిగితే అప్పుడు మనం ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతాము. గీతలో భగవంతుడు ఏమి చెప్పాడు అంటే భగవంతుడు ఎలా చెపితే అలా పని చెయ్యి, అలాచేస్తే





నీవు ఆయన దయకు పాత్రుడవుతావు. ఎప్పుడైతే నీవు ఆయన దయకు పాత్రుడవు అయ్యావో అప్పుడు నిన్ను మాయలో నుండి విడుదలచేస్తాడు, జననమరణ చక్రంలోనుండి విడుదల చేస్తాడు. లోపలఉన్న ఆనంద సముద్రం పొంగాలి కాని అది పొంగితే నీ మనస్సులో ఉన్న బలహీనతలు, వాక్కులో ఉన్న బలహీనతలు అన్నీ ఆ ప్రవాహములో కొట్టుకొనిపోతాయి, నీవు పరమపవిత్రుడవు అవుతావు. మీ హృదయంలో ఉన్న ఆనందం మీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు సృష్టికర్త వచ్చి నీ ఎదురుగా నిలబడినా నీకు చూడాలనిపించదు, దాని వైభవం అట్టిది. మనం పవిత్రులము అవ్వాలంటే వాక్కు తపస్సు, మానసిక తపస్సు, శారీరక తపస్సు ఉండాలి. మనం జాగ్రత్తగా నాలుగుసార్లు ఆలోచించి మాట్లాడాలి, మాట సౌమ్యంగా, హితవుగా ఉండాలి. మనం టీచింగ్ చేసేటప్పుడు ఎదుటివారి ఫీలింగ్ హర్టు అవ్వకూడదు. ఇది వాక్కు తపస్సు. మనం పెద్దలకు సేవచేయాలి, ఈశ్వరుని పాదాలయందు భక్తి కలిగి ఉండాలి, సత్పురుషులతో సహవాసం చెయ్యాలి. ఇవి అన్నీ ఉంటేగాని మనకు క్రమశిక్షణరాదు. మనకు అనేక తలంపులు వస్తాయి. ఏమిటి ఈ తలంపులు అనుకోవద్దు, ఈ తలంపులే మన జీవితాన్ని తీర్చిదిద్దుతాయి. అందువలన తలంపుల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మనకు ఎటువంటి తలంపులు వస్తున్నాయో దానిని బట్టి భవిష్యత్ జీవితం ఉంటుంది. తలంపుల విషయంలో అజాగ్రత్తగా ఉండి, జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలి అని మనం అనుకొంటే నూటికి నూరుపాళ్ళు ఫెయిల్ అవుతాము. అందువలన తలంపుల విషయంలో జాగ్రత్త అవసరము. ఇది మానసిక తపస్సు. నేను అనే తలంపు లేకుండా మనం ఎంత పని చేసినా మనం టైర్ అవ్వము. మనంచేసేపనిని పూజ అనుకొని శ్రద్ధగా, సక్రమంగా చేస్తే ఆ పనిద్వారా కూడా మనం తరించవచ్చు. పని నిరహంకారముగా చేయాలి, సోమరితనం పనికిరాదు. ఇది శారీరక తపస్సు. ఆ మూడు తపస్సులు లేకుండా నీవు పవిత్రుడవు కాలేవు.

భగవాన్ దగ్గరకు ఒకరు వచ్చి నేను దొంగతనం చేసాను, దానికి ప్రాయశ్చిత్తం ఏమిటి అని అడిగాడు. దొంగతనం ఎవరు చేసారు? నీ దేహం, నీ మనస్సు కలసి ఆ పని చేసాయి. ఆత్మ ఎప్పుడూ దొంగతనం చేయదు, నువ్వు ఆత్మవే కదా అన్నారు. ఆత్మజ్ఞానం సంపాదించటమే ప్రాయశ్చిత్తం అని చెప్పారు. భవిష్యత్ అలా ఉంటుంది, ఇలా ఉంటుంది అని ఊహించుకోవద్దు. జరిగిపోయిన గొడవలు తలపెట్టుకోవద్దు. దానివలన నీ టైము వేష్టు, ఎనర్జీ వేష్టు అవుతుంది. అందుచేత భవిష్యత్ గురించి ఊహించుకోవద్దు, గతాన్ని మర్చిపో. నీచేతిలో ఉన్న వర్తమాన కాలాన్ని మేగ్జిమమ్ ఉపయోగించుకో. అప్పుడు నీ సాధన సరళంగా, సహజంగా జరుగుతుంది, వస్తువు అనుభవంలోనికి వస్తుంది. నీ దేహానికి, మనస్సుకు పరిమితమైన నేనును

విడిచిపెట్టగలిగితే ఈశ్వరుడు తన స్వరూపాన్ని ఇస్తాడు, అదే మోక్షం. నీకు లోకవాసన ఉంటే అసలు మనస్సు లోపలకు వెళ్లదు. లోకవాసన ఉన్నవాడికి కోటి జన్మలు ఎత్తినా జ్ఞానంరాదు. జ్ఞానం అనేది ఎవరో ఒక రమణమహర్షి, ఒక రామకృష్ణుడు వారి స్వంత ఆస్తికాదు. జ్ఞానానికి మీరు కూడా వారసులే. ఈ ప్రపంచంలో ఉండగానే, ఈ శరీరం స్మశానానికి వెళ్లకముందే ఎవడైతే నిష్ప్రపంచస్థితిని పొందాడో వాడిని జ్ఞానం వరిస్తుంది. దేహము నేను అనే ఒక్క తలంపే నిన్ను హృదయం యొక్క లోతులలోనికి వెళ్లనివ్వకుండా చేసేస్తుంది. భగవాన్ అంటారు మీకు ఓపిక ఉంటే సాధన చెయ్యండి లేకపోతే ఈ దొంగనేనును ముస్తాబు చేయకండి అంటారు. ఆత్మస్తుతి, పరనింద వలన దొంగనేను పెరిగిపోతుంది. పరనిందవలన చాలా ప్రమాదం ఉంది. మనం ఎవరినైతే నిందిస్తున్నామో వారి దోషాలు మనకు వస్తాయి, మనలో పుణ్యం ఉంటే భగవంతుడు వారికి ఇచ్చేస్తాడు. మీరు సాధన పేరుమీద పెద్ద కష్టపడనక్కరలేదు. సబ్జక్టును అవగాహన చేసుకోవటం ముఖ్యం. గురుకృపవలన, ఈశ్వరకృపవలన మీకు అందరికీ జ్ఞానం తప్పనిసరిగా వస్తుంది. మీరు దేహగతమైన నేనును మాత్రం అలంకరించవద్దు. అహంభావరహితస్థితిని పొందటానికి నీవు చేసే పనే నిజమైన పని. నువ్వు మంచిపనిచేసి, నేను మంచిపని చేసాను అని పొంగిపోకూడదు. నీవు చేసిన మంచిపని నీ అహంభావనను ఎంతవరకు తగ్గించగలిగింది అని నీవు చూసుకోవాలి. శారీరకంగా మనం గురువుకు దగ్గరగా ఉండవచ్చు, ఉండలేకపోవచ్చు కాని గురువుతో మానసికఅనుబంధం ముఖ్యం. మన శరీరం ఎక్కడ ఉన్నా గురువుతో, ఈశ్వరునితో మానసిక అనుబంధం కలిగి ఉండటంవలన మనం తొందరగా పవిత్రులవుతాము. నీ దేహప్రారబ్దంలో ఏపని అయితే ఉందో దానిని చెయ్యి. నీవు అదనంగా పనిచేద్దామన్నా అది నీచేతికి అందదు. నువ్వు చేసేపని ఇష్టంగా, ప్రేమగా, శ్రద్ధగా చేయటంవలన కొత్తవాసనలు రావు, పాతవాసనలు నశిస్తాయి. నీవు స్వార్థం లేకుండా పనిచేస్తే అది ధ్యానంతో సమానము. మనస్సులో నన్ను స్మరించుకో, చేతులతో పనిచెయ్యి అని కృష్ణుడు అర్జునుడితో రిపీటెడ్‌గా చెపుతాడు. ఈ రెండే సూత్రాలు. మిమ్మల్ని ఎవరైనా విమర్శిస్తే అది మనస్సుతో పట్టుకోకూడదు, అక్కడే వదిలేయాలి. మీరు మనస్సుతో పట్టుకొంటే మీకు వికారం వచ్చేస్తుంది. వికారం వచ్చినప్పుడు వాడితోమీకు శత్రుత్వం డెవలప్ అవుతుంది. ఆ శత్రుత్వం వలన భగవంతుడు మీకు జ్ఞాపకం రాడు, ఎప్పుడూ వాడే జ్ఞాపకం వస్తాడు. నువ్వు ఇంటి దగ్గర శాంతిగా ఉండి, నలుగురులోకి వెళ్లినప్పుడు నీకు శాంతి పోతోంది అనుకో, అది నిజంకాదు. నువ్వు ఆధ్యాత్మికంగా నిజంగా అభివృద్ధి పొందుతున్నావు అనుకో నీవు పూజగదిలో కూర్చున్నప్పుడు



4A

ఎంతకూల్‌గా ఉంటావో, నీవు ఆఫీసులో ఉన్నా, లక్షమంది మధ్యలోఉన్నా అంత కూల్‌గా ఉండగలగాలి. అలా ఉండగలిగితే నీవు ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వచ్చినట్లు గుర్తు. మానవుడికి అమృతానుభవం కలగకపోవటానికి ఒకటే కారణం స్వార్థం. ఆస్వార్థంలో నుండి విడుదల పొందిన వెంటనే హృదయంలో ఉన్న వస్తువు తనకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. భగవంతుడు నీకు ఏ పని అయితే కేటాయించాడో ఆ పనిని శ్రద్ధగా చెయ్యి. నిన్ను చూసి ఇతరులు నేర్చుకొంటారు. నువ్వు పవిత్రుడవయితే నీ ప్రభావం వారిమీద పడివారు కూడా పవిత్రులవుతారు. అందువలన ముందు నీవు బాగుపడటానికి ప్రయత్నించు. అన్ని దానాలలోనికి అభయదానం గొప్పది అని భగవాన్ చెప్పారు. ఎవరికైనా భయం వేస్తూ ఉంటే, వాడిని దగ్గరకు చేరదీసి వాడికి భయం లేకుండా చేయటం అన్నదానం, విద్యాదానం, అన్ని దానాలకంటే గొప్పది.

## కూపన్

ఎడిటర్ గారికి,

నేను రమణభాస్కర సంవత్సర చందా నిమిత్తం రూ॥ 150/-లు (అక్షరాలా నూటయాబది రూపాయలు మాత్రమే) యం.ఓ. / డి.డి. / నగదు పంపించుచున్నాను. క్రమం తప్పకుండా ప్రతులు పంపించగలరు. (ది. 23-9-2002 నుండి 22-9-2003) వరకు.

పేరు ..........................................................................................................

తండ్రి / భర్త ..................................................................................................

డోర్ నెం. ........................................................ వీధి / రోడ్ పేరు.......................................

గ్రామం ........................................................................................ పిన్ కోడ్ ...........................

మండలం ............................................................... జిల్లా...................................................

డి.డి. / యమ్.ఓ./నగదు వివరాలు ............................................ ఫోన్ నెం..............................

**పెన్మెత్స శ్రీరామరాజు**
**("రమణభాస్కర" కొరకు)**
**శ్రీరమణ క్షేత్రం, జిన్నూరు - 534 265**
**ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్**

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 30-08-2002 | శుక్రవారం | కృష్ణాష్టమి - శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు |
| 08-09-2002 | ఆదివారం | ఫెర్టిలైజర్ అసోసియేషన్ బిల్డింగ్, ఐ-భీమవరం రోడ్, ఆకివీడు |
| 15-09-2002 | ఆదివారం | తాడిమళ్ళ వారి కేంద్రం, బాలజ్యోతి కాన్వెంటు ప్రక్కన, శ్రీరాంపేట, భీమవరం |
| 23-09-2002 | సోమవారం | సద్గురు శ్రీ నాన్నగారి జన్మదిన మహోత్సవము, శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు |



శ్రీ **దాట్ల కృష్ణమూర్తిరాజు** గారు, (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, విజిలెన్స్ & క్వాలిటీ కంట్రోల్, పంచాయితీ రాజ్‌శాఖ, కడప) పదవీ విరమణ చేసిన సందర్భంలో భీమవరం రైస్ మిల్లర్స్ భవనంలో ది॥ 13-07-2002 స్థిరవారం సన్మానసభ జరిగింది. ఈసభకు సద్గురు శ్రీ నాన్నగారు మరియు యిందుకూరి రామలింగరాజుగారు (చైర్మన్, మార్కెటింగ్ కమిటీ, భీమవరం) ముఖ్య అతిధులుగా విచ్చేసినారు. ఉత్తమ సేవలందించినందుకుగాను కృష్ణమూర్తిరాజుగారు పశ్చిమగోదావరి జిల్లాస్థాయిలో 4 పర్యాయములు ప్రశంసాపత్రములు పొందిరి. ఈ సన్మానసభను గ్రామీణ నీటిసరఫరా విభాగము, పంచాయితీరాజ్, భీమవరంశాఖవారు ఏర్పాటుచేసినారు.


ఓం నమో భగవతే శ్రీరమణాయ



గౌరవ ట్రస్టీ :
**సద్గురుశ్రీనాన్నగారు**

## సద్గురు శ్రీనాన్నగారు ఛారిటబుల్ ట్రస్టు

50-28-22, టి.పి.టి. కాలనీ, సీతమ్మధార,
విశాఖపట్నం - 530 013
రిజిష్టర్డు నెం. 10/2002 ☎ (O) 792346, 551265, (R) 552141



భగవాన్
శ్రీ రమణ మహర్షి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఆరుకోట్ల ఆంధ్రులలో అరుదైన మానవతాతీతమైన తత్త్వముకలిగి ఆలోచన, మాట, ఆచరణ ఒకేవిధముగా ఉంటూ, రాగద్వేషముల నెరుగక, సత్త్వగుణము, ప్రేమ, దయ, ఆదరణ, సహనము, నిరాడంబరత్వము కలిగియుండి, తాను గుర్తించిన సత్యమును అందరికి తెలియపర్చాలనే భావముతోను, తాను పొందుచున్న శాంతి అందరూ పొందాలనే కాంక్షతో, వయోభారమును గమనించక అడిగిన వారి గ్రామ గ్రామములకు వెళ్ళి, మానవ జీవితలక్ష్యమును సాధించు మార్గమును బోధించుచూ, ఆయనకు భక్తులు అందించు కానుకలను వేరువేరు సంస్థలకు, వ్యక్తులకు, నిరాధారులైన వృద్ధులకు గుప్తముగ పంచియిచ్చుచున్న అపర దానకర్ణునివలె ఉంటూ, వేలాది భక్తుల హృదయములలో ఆరాధ్య దైవముగ అలరారుచూ, అందరికి ఆదర్శప్రాయముగ వున్న, సద్గురు శ్రీ నాన్నగార్ని చూసి, వారు చేయు సంక్షేమ కార్యక్రమములలో ఒకటైననూ, వారిపేరుతో చేయాలనే భావనతో మా కుటుంబ పరముగ నడుపుటకు "సద్గురు శ్రీ నాన్నగారు ఛారిటబుల్ ట్రస్ట్" ఏర్పాటుకు వారి అనుమతిని కోరగా, ముందు నిరాకరించిననూ, ఎదుటవారిని అసంతృప్తి పరచని స్వభావము సహజముగ ఉన్నందున వారి పేరున ట్రస్టు ఏర్పాటుకు అంగీకరించిరి. కాని ట్రస్టు కేవలము కుటుంబ పరముగ కాక, ఎవరైననూ ఇందు భాగస్వాములు కాగోరినచో తిరస్కరించరాదని గురుదేవులు చెప్పియున్నారు. అదేవిధముగ ట్రస్టు నడుపబడుచున్నది. మరియు శ్రీ నాన్నగార్ని గౌరవ ట్రస్టీగా ఉండవలసినదిగా కోరగా, వారు దానికి అంగీకరించినందున వారికి ట్రస్టు తరపున కృతజ్ఞతలను తెలుపుకొనుచున్నాను. శ్రీనాన్నగారు మరికొందరు ఇతరులు ఈ ట్రస్టునందు భాగస్వాములైనందుకు వారికి నా కృతజ్ఞతలను తెలుపుకొనుచున్నాను.

ఆశయములు :
1. ఆర్థికముగ వెనుకబడిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇచ్చుట.
2. నిరాధారులైన వృద్ధులు, అంగవైకల్యము గలవారికి నెలసరి పెన్షన్ ఇచ్చుట.
3. అర్హతగల విద్యా సంస్థలకు సహకరించుట.
4. వృద్ధుల ఆశ్రమములకు ఆర్థిక సహాయము అందించుట.
5. నిరాధారులైన వ్యాధిగ్రస్తులకు సహకారము చేయుట మరియు
6. శ్రీ గౌరవట్రస్టీగారి సూచనల మేరకు ఇతర కార్యక్రమములు చేయుట.

16-08-2002
విశాఖపట్నం



ఇట్లు, విధేయుడు
**పెన్మెత్స సత్యనారాయణరాజు**
మేనేజింగ్ ట్రస్టీ